క్లుప్తంగా

వాహనదారులు నిబంధనలు పాటించాలి

మానవపాడు: వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పని సరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ చంద్రకాంత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లపై పరిమితికి మించి వాహనాలు నడపరాదని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమం కింద దాదాపు 60 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ సింధు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు బీపీ, షుగర్, థైరాయిడ్, రక్తపరీక్షలు చేశారు. అనంతరం మందులు అందజేశారు. కార్యక్రమంలో మహిళలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల ముందస్తు అరెస్ట్



ఉండవెల్లి: చలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో 8 మంది ఆశా కార్యకర్తలను ముందస్తు అరెస్ట్ చేసినట్లు ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం ఉండవెల్లి, కంచుపాడు, తక్కశీల గ్రామాలకు చెందిన 8 మందిని అరెస్ట్ చేసి ఉండవెల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

నీటి సరఫరా నిలిపివేత

అయిజ: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో మంగళవారం మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోయింది. ఈ నేపథ్యంలో మరమ్మతు చేసేందుకు బుధవారం పట్టణంలోని అన్ని కాలనీలకు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ ఏఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

ఇసుక లారీ పట్టివేత

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నారు. లారీని సీజ్ చేసి, డ్రైవర్ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు. కర్నూల్ జిల్లా తుంగభద్ర నది తీరం నుంచి మంగళవారం అక్రమంగా జాతీయ రహదారిపై హైదరాబాద్‌కు ఇసుకను లారీలో తరలిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు ఖాదర్ బాషా, మద్దిలేటిలు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో డ్రైవర్ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

నిరవధిక సమ్మెపై వినతి



ధరూరు : సమగ్ర శిక్ష ఉద్యోగులందరని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభించనున్న నిరవధిక సమ్మెపై సమగ్ర శిక్ష ఉద్యోగులు మంగళవారం మండల ఇన్‌చార్జి ఎంఈఓకు వినతి పత్రం అందజేశారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో మండల ఎంఐ కోఆర్డినేటర్ వెంకటేష్, సీఆర్‌పీ నర్సింహులు, కేజీబీవీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాల్వాయిలో ఘనంగా రథోత్సవం



మల్దకల్ : మండలంలోని పాల్వాయి గ్రామంలో వెలసిన చింతలాముని నల్లారెడ్డి స్వామి రథోత్సవం మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్ శివరామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ యశోదమ్మ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై దాసంగాలు పెట్టి నైవేద్యాలు సమర్పించారు.

ఉన్నత శిఖరాలు చేరుకోవాలి



గట్టులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీఓ చెన్నయ్య

అయిజ: నిత్యం సాధన చేసి క్రీడాకారులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలని తహసీల్దార్ జ్యోతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీల కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. మండలంలోని 12 గ్రామాల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలను పీఈటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటయ్య, ఎంఈఓ రాములు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు శ్రావలి ఆచారి, రాణెమ్మ, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడలు ప్రారంభం

ఉండవెల్లి: మండలంలోని ప్రయాగ్ పాఠశాలలో సీఎం కప్ క్రీడలను జిల్లా క్రీడల అధికారి ఆనంద్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్ ప్రారంభించారు. మంగళవారం సీఎం కప్ క్రీడల్లో 150 మంది విద్యార్థులు మండల స్థాయిలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ రామకృష్ణ, ఎంపీడీఓ తిరుపతన్న, ప్రధానోపాధ్యాయురాలు హేమలత, పీడీలు శైలజ, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

గట్టులో సీఎం కప్ క్రీడా పోటీలు

గట్టు : మండల కేంద్రంలో సీఎం కప్ క్రీడా పోటీలు మంగళవారం నిర్వహించారు. కస్తూర్బా పాఠశాల ఆవరణలో నిర్వహించిన పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపీడీఓ చెన్నయ్య క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ నల్లారెడ్డి, కేజీబీవీ ఎస్‌ఓ గుంటి గోపిలత, వివిధ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోటీలు ప్రారంభం..

ఇటిక్యాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నుంచి రెండు రోజుల పాటు మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, తదితర క్రీడల్లో పోటీలు ఉంటాయన్నారు. మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొని క్రీడా నైపుణ్యాలు ప్రదర్శించాలని కోరారు.



ఉండవెల్లిలో క్రీడలు ప్రారంభిస్తున్న అధికారులు



ఉండవెల్లిలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు



అయిజలో క్రీడాకారుల కరచాలనం

ఆరు బయటే వంట.. పట్టని అధికారులు



ఉండవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరుబయటే వంట వండుతున్న సిబ్బంది

ఉండవెల్లి: విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించడానికి అధికారులు వస్తున్నారే కానీ వంట తయారు చేసే ప్రదేశాలను పట్టించుకుంటున్నారా అని విద్యార్థులు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆరుబయటే తయారు చేస్తున్నారు. వర్షం పడినా, విష పురుగులు వచ్చిన అక్కడే వండుతున్నారన్నారు. వంట గది ఉన్నా బండలు కుంగిపోయి. ఎలుకలు, పంది కొక్కులు చొరబడుతున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. మధ్యాహ్న భోజన వసతికి గది ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. మండల ఎంఈఓ రామకృష్ణ ఇంత వరకు మండల కేంద్రంలోని పాఠశాలను పరిశీలించలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నప్పటికీ స్థానిక అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

హక్కులు కాపాడుకునేందుకు కృషి చేయాలి



గట్టులో నిరసన తెలుపుతున్న మహిళలు



అయిజలో ర్యాలీ చేస్తున్న నాయకులు, కూలీలు

అయిజ: హక్కులను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహులు అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో 'హక్కుల కోసం ప్రజా చైతన్య యాత్ర' కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ కూలీలు బ్యానర్ చేపట్టి ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా నరసింహులు మాట్లాడుతూ.. 1948 డిసెంబర్ 10న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ మానవ హక్కుల సార్వత్రిక ప్రకటనను ఆమోదించిన రోజన్నారు. వివక్షను అంతం చేయడం, పేదరికంపై పోరాటం చేయడం, మానవ హక్కుల ఉల్లంఘన, బాధితులను రక్షించడం వంటి ప్రధాన అంశాలు ప్రపంచదేశాలు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ జిల్లా మహిళా కార్యదర్శి లావణ్య, వ్యవసాయ కూలీలు జమ్మన్న, మహేష్, రాజు, కిరణ్, తిమ్మప్ప, కిష్టమ్మ, దేవమ్మ, లక్ష్మి, కావేరి, పద్మమ్మ, చెన్నప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

గట్టులో మహిళల నిరసన

గట్టు : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మంగళవారం మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మహిళలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద మాట్లాడుతూ.. స్వేచ్ఛా, స్వతంత్రంగా బతకడం ప్రతి మనిషి జన్మ హక్కని, మహిళా హక్కులే మానవ హక్కులన్నారు. మహిళలపై నిత్యం అనేక అకృత్యాలు చోటు చేసుకుంటున్నాయని వాటిని అరికట్టే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. లింగ వివక్షత లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా కమిటీ సభ్యులు జయమ్మ, అంజనమ్మ, నర్సమ్మ, గోవిందమ్మ, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్



మల్దకల్‌లో మాట్లాడుతున్న అధికారులు

గట్టు : విద్యార్థులకు క్రమ శిక్షణతో ఉజ్వల భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని జిల్లా ఉపాధి కల్పన అధికారి, గట్టు మండల ప్రత్యేక అధికారిణి డాక్టర్ ప్రియాంక అన్నారు. మంగళవారం మాచర్ల ఉన్నత పాఠశాలను అధికారులు సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారిని డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ.. వంట గది పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికా ప్రకారం చదువుకుంటే వార్షిక పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు అవుతారన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ నర్సింహులు, ఎంఈఓ నల్లారెడ్డి, హెడ్మాస్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన..

మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల ప్రత్యేక అధికారి సక్రియనాయక్, ఎంపీడీఓ భాస్కర్‌ల ఆధ్వర్యంలో పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ అందరి బాధ్యత..

మల్దకల్ : బాలల పరిరక్షణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యతని సీడీపీఓ హేమలత అన్నారు. మంగళవారం మద్దెలబండ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలల హక్కులను కాలరాయడం చట్టరీత్యా నేరమన్నారు. బాలల కమిటీలో ఉన్న 14 మంది సభ్యులు తమ గ్రామంలో జరుగుతున్న బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించేందుకు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. అదే విధంగా బాలల సంరక్షణకు 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎస్సై నందికర్, ఎంపీఓ రాజశేఖర్, సూపర్‌వైజర్ నాగరాణి, ప్రకాష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చింతరేవులలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



ధరూరు : మండల పరిధిలోని పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామిని మంత్రాలయం ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి దర్శించుకున్నారు. మంగళవారం సాయంత్రం కుటుంబ సమేతంగా ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు లాంఛనాలతో ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు కిష్టాచార్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గిరిరావు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీది కీలక పాత్ర

అలంపూర్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో నాడు బీఎస్పీ కీలక పాత్ర పోషించిందని బీఎస్పీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మోహన్‌రాజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీలు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయని మండిపడ్డారు. నాడు పార్లమెంటులో 30 మందికి పైగా బీఎస్పీ పార్లమెంట్ సభ్యులతో తీర్మానం చేసి రాష్ట్ర ఏర్పాటుకు మద్దతుగా ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్, యర్మియా, కృష్ణయ్య, అనంతం, ఏసురాజ్, నారాయణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జమ్ములమ్మకు ప్రత్యేక పూజలు

శాంతినగర్ : కొంకల గ్రామంలో వెలసిన శ్రీ జమ్ములమ్మ అమ్మవారికి అలంపూర్ జోగుళాంబ దేవి ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, పుస్తె, మెట్టెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయులకు సూచనలు

ధరూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్ర బాబు పాల్గొన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయా గ్రామాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులతో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని కాంప్లెక్స్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు సంబంధించి యాక్షన్ ప్లాన్ వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు

కేటీదొడ్డి : మండల పరిధిలోని చింతలకుంట గ్రామంలోని మంగళవారం మౌలాలి ఖాసీం తాత ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులోని మసీద్ వద్ద భక్తులు దాసాంగాలు, పొట్టేళ్లను బలిచ్చి మొక్కులు చెల్లించుకునేందుకు భారీగా చేరుకున్నారు. ఉత్సవాల్లో చుట్టు పక్క గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

పండ్ల తోటల సాగుపై ఆసక్తి చూపాలి



మల్దకల్‌లో అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నర్సింగరావు

మల్దకల్ : రైతులు పండ్ల తోటల సాగుపై ఆసక్తి చూపాలని డీఆర్‌డీఓ నర్సింగరావు సూచించారు. మంగళవారం మండలంలోని మల్దకల్, శేషంపల్లి గ్రామాల్లోని పండ్ల తోటలు ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే పండ్ల తోటలను సాగుచేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే చీడపీడల నివారణకు ఉద్యానవన శాఖ అధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అదే విధంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలు పరిశీలించారు. నర్సరీల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు పెంచి సంరక్షించాలన్నారు. అలాగే రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలకు ట్రీగార్డులు ఏర్పాటు చేయడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ రాజశేఖర్, ఏపీఓ సుజాత, టెక్నికల్ అసిస్టెంట్లు ప్రమీల, నరేష్, అనూష, ఇబ్రహీం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ అధ్యక్షుల నియామకం



నియామక పత్రాలు అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

రాజోళి : బీజేపీ పార్టీ పోలింగ్ బూత్ అధ్యక్షుల నియామకం పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. రాజోళి మండలంలోని 18 మంది పోలింగ్ అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. బీజేపీ వైపు ప్రజలు చూస్తున్నారన్నారు. ముఖ్యంగా తెలంగాణలో బీజేపీ దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలంతా విరక్తి చెందారన్నారు. ఆరు గ్యారెంటీలు, 426 మోసాలతో ఏడాది పాలనలో ప్రజలు విసుగుచెందారన్నారు. త్వరలో బీజేపీ మండల అధ్యక్షులు, జిల్లా కమిటీలను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజోళి మండలాధ్యక్షుడు సంజీవరెడ్డి, మండల రిటర్నింగ్ అధికారి ఓంకార్, శశి, మల్లేష్, రాజేష్, అంకతిరావు, గట్టు రాము, అంజి, భీమన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోసపూరిత హామీలతో అధికారంలోకి



జిల్లా కేంద్రంలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గద్వాల : కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని మాజీ జెడ్పీటీసీ బాసుశ్యామల అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ తల్లి విగ్రహానికి నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ ద్రోహి సీఎం రేవంత్ రెడ్డి అని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ కాలంలో రూపకల్పన చేసిన తెలంగాణ తల్లి విగ్రహంలోని బతుకమ్మను తొలగించి యావత్తు మహిళల మనోభావాలు దెబ్బతీశారని మండిపడ్డారు. కార్యక్రమంలో బస్వరాజ్, శేఖర్ నాయుడు, గోవర్ధన్, రాములు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం..

అయిజ: మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు పల్లయ్య మాట్లాడుతూ.. తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ అంటేనే బతుకమ్మ గుర్తుకు వస్తుందని, బతుకమ్మ ఆనవాళ్లు తొలగించడం మూర్ఖత్వమని మండిపడ్డారు. తెలంగాణ అస్తిత్వాన్ని మార్చాలని చూస్తే కాల గర్భంలో కొట్టుకపోతారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమేష్ బాబు, మద్దిలేటి, ముక్తార్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలి'



మాట్లాడుతున్న వలుగమాన్ బలరాం

గద్వాల : ఏకలవ్య కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఎరుకల హక్కుల పోరాట సమితికి ఇవ్వాలని ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వలుగమాన్ బలరాం డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎరుకల తెగకు చెందిన వారు చేసిన పోరాట ఫలితంగానే ప్రభుత్వం ఏకలవ్య కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈ పదవిని ఎరుకల హక్కుల పోరాట సమితికే ఇవ్వాలని కోరారు. ఎరుకల తెగకు చెందిన వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామన్నారు. సమస్యలపై పూర్తి స్థాయిలో చర్చలు జరిపి కమిటీలను వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వలుగమాన్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి చిలుమర్తి ఎల్లప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు వలుగమాన్ మణిగిల్ల, నాయకులు వెంకటేష్, సుంకన్న, నర్సింహ్మా పాల్గొన్నారు.

నాణ్యమైన బియ్యం ఇస్తేనేగా..



సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

గట్టు : పురుగులు పట్టిన మక్కిపోయిన బియ్యం ఇచ్చి భోజనం మంచిగా వండాలంటే ఎట్లా సారు అంటూ వంట ఏజెన్సీ నిర్వాహకులు అధికారుల ముందు వాపోయారు. మంగళవారం గట్టులో వివిధ పాఠశాలలకు చెందిన హెచ్ఎంలు, వంట ఏజెన్సీ నిర్వాహకులతో మధ్యాహ్న భోజనంపై అధికారులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ చెన్నయ్య, ఎంఈఓ నల్లారెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, వంటకు సంబంధించిన పాత్రలు ప్రతిరోజు శుభ్రం చేయాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఈ సందర్భంగా వంట ఏజెన్సీ నిర్వాహకులు మాట్లాడుతూ.. బిల్లులు కూడా సక్రమంగా చెల్లించడం లేదని, చాలా కాలంగా మధ్యాహ్న భోజనం బిల్లులు బాకీ పడ్డారు. వాటి సంగతి చూడడండి అంటూ తెలిపారు. కార్యక్రమంలో నీతి అయోగ్ జిల్లా కోఆర్డినేటర్ అఫ్జల్, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, వంట ఏజెన్సీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



ప్రారంభోత్సవంలో చైర్మన్ హనుమంతు

కేటీదొడ్డి : విద్యార్థులు క్రమ శిక్షణతో చదవడంతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ నల్లా హనుమంతు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రూ. 2.70 కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ పాఠశాలను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. బాలికల విద్యాభివృద్ధి కోసం ఎల్లవేళలా తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్, ఉరుకుందు, టీచర గోవిందు, తిక్కన్న, గోపాల్, శేఖర్‌రెడ్డి, నసీర్, యూత్ మండల అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, ఎస్‌ఓ పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాగులో సరైన మెళకువలు పాటించాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఎర్రవల్లి: కూరగాయల సాగులో రైతులు సరైన మెళకువలు పాటిస్తే అధిక లాభాలు ఆశించవచ్చని రుద్రూరు పరిశోధన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి రైతు వేదికలో జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కూరగాయలు, ఆకుకూరలు పండించడంలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు, వ్యవసాయ అధికారులకు అవగాహన కల్పించారు. విత్తనాల్లో మొలక శాతం 70 కంటే ఎక్కువగా ఉండాలన్నారు. ముఖ్యంగా విత్తన శుద్ధి చేసిన విత్తనాలు మాత్రమే విక్రయించాలని లేదా రైతులు సొంతంగా ఇంటి దగ్గరే విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవికుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.